www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

గురువారం
29.10.2026





రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణను ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా, మూగజీవాలకు పశుగ్రాసం కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు మండల స్థాయిలో ప్రత్యేక సమన్వయ కమిటీలను నియమిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేస్తూ, భూగర్భ జలాల పెంపు, చెరువుల పరిరక్షణతో పాటు మౌలిక వసతుల కల్పనపై యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించేలా అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం సన్నద్ధం చేసింది.

-కలంజ్యోతి బ్యూరో

ఎల్‌నినోపై సర్కార్ నజర్

- ఉపాధి కల్పన తాగునీటి భద్రతపై దృష్టి
- పశుగ్రాసం సాగుకు ప్రాధాన్యత
- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన
- వారానికి ఒకసారి సమీక్ష సమావేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

2లో..

మండల స్థాయి సమన్వయ కమిటీల ఏర్పాటు

ఎంపీడీవో అధ్యక్షతన కమిటీల నియామకం



హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానివ్వొద్దు

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- శుద్ధి చేసిన నీటినే వాడాలి
- ఎస్టీపీల పర్యవేక్షణకు ప్రత్యేక వ్యవస్థ
- నవంబర్ 1 నుంచి కొత్త నిబంధనలు

2లో..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మరో శుభవార్త తెలిపింది. ప్రభుత్వంలోని ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ విభాగంలో ఖాళీగా ఉన్న 102 మల్టీ పర్పస్ సోషల్ ఆర్గనైజర్ (ఎంపీఎస్ఓ), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టుల భర్తీకి కమిషన్ అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఉద్యోగాలకు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నారు. సంబంధిత విభాగాల్లో డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు కమిషన్ అధికారిక పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

కలంజ్యోతి, హైదరాబాద్

టీజీపీఎస్సీ నుంచి మరో నోటిఫికేషన్

- ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ శాఖలో ఖాళీల భర్తీ
- మొత్తం 102 పోస్టులకు ప్రకటన విడుదల
- రేపటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం
- అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

2లో..



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
2
గురువారం 29.10.2026
www.kalamjyothi.com

ఎల్‌నినోపై సర్కార్ నజర్



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 28) : ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండల స్థాయి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జీవో ఆర్టీ నంబర్ 579ను విడుదల చేసింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో కూడిన సమన్వయ కమిటీలు క్షేత్ర స్థాయిలో ఏర్పాటయ్యాయి. ఎల్‌నినో వల్ల ఉత్పన్న మయ్యే పరిస్థితులను ముందస్తుగా ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని ప్రభుత్వం సన్నద్ధం చేసింది.

ఉపాధి కల్పన తాగునీటి భద్రతపై దృష్టి..

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర ఉపాధి కల్పన, తాగునీటి భద్రతతో పాటు పశుగ్రాసం లభ్యతపై మండల కమిటీలు ప్రత్యేక దృష్టి సారించనున్నాయి. రాష్ట్రంలోని 35,959 చిన్ననీటిపారుదల చెరువుల పరిధిలో పశుగ్రాసం సాగుకు అనువైన భూములను గుర్తించి, మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్ణయించారు. మూగజీవాల కోసం కొత్త నీటి తొట్టెల నిర్మాణం, పాత తొట్టెల మరమ్మతులతో పాటు వ్యవసాయ కుంటలు, చెక్‌డ్యామ్‌లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల ద్వారా భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన..

గ్రామీణ రహదారులు, కల్వర్టులు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, పశువుల షెడ్ల నిర్మాణ పనులను ముమ్మరం చేయనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను రూపొందించనున్నారు. మండల సమన్వయ కమిటీలు వారానికి కనీసం ఒకసారి తప్పనిసరిగా సమావేశమై పనుల పురోగతిని సమీక్షించాలని, ఆ నివేదికలను జిల్లా కలెక్టర్లకు సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పనుల అమలు, పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం జిల్లా కలెక్టర్లకు అప్పగించింది.

హైదరాబాద్‌కు తాగునీటి సమస్య రానివ్వొద్దు



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 29) : రాజధాని హైదరాబాద్ నగరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరంలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, శుద్ధి చేసిన నీటి వినియోగంపై ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ అవసరాల కోసం క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని ఆదేశించారు.

శుద్ధి చేసిన నీటినే వాడాలి..

సచివాలయం, సీఎంవో, ఔటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణతో పాటు పబ్లిక్ పార్కులు, రోడ్ల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని సీఎం సూచించారు. భవన నిర్మాణాల్లో ట్రీటెడ్ వాటర్ మాత్రమే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, డేటా సెంటర్లకూ ఈ నీటినే సరఫరా చేయాలని ఆదేశించారు. నీటి నాణ్యతలో రాజీ పడకుండా అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని, ఎస్టీపీల వద్ద ప్రత్యేక అధికారులను నియమించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని ఆదేశించారు. నవంబర్ 1 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి రావాలని, ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్, ట్యాంకర్ల ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.



విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తాం

కలంజ్యోతి, ఇల్లంతకుంట (అక్టోబర్ 28) : విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్థానిక ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని జెడ్పీ హెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు షూస్, సాక్స్, బెల్టుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని, విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎం. రాజు తెలిపారు. సర్కారు బడుల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూగు నాగరాజ్ శర్మ, వార్డు సభ్యుడు, ఇల్లంతకుంట యువజన సంఘాల అధ్యక్షుడు రేగుల కార్తీక్, చేరాల వంశీకృష్ణ పాల్గొని విద్యార్థులకు షూస్, సాక్స్, బెల్టులను స్వయంగా అందజేశారు.

తుఫానుతో మారిన వాతావరణం

కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 29) : అర్నబ్ తుఫాను ప్రభావంతో చెన్నారావుపేట మండలంలో వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై బలమైన ఈదురుగాలులు వీస్తుండటంతో పాటు వర్షం కురిసే వాతావరణం నెలకొంది. తుపాను ప్రభావం వల్ల వరంగల్, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ఉత్తర తెలంగాణలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో మండల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రైతులు కోతకు సిద్ధంగా ఉన్న పంటలను, ఆరబోసిన ధాన్యాన్ని తడిసిపోకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించి భద్రపరుచుకోవాలని తెలిపారు. ఈదురుగాలుల తీవ్రత దృష్ట్యా విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు, ఉధృతంగా ప్రవహించే చెరువులు, వాగుల సమీపంలోకి ఎవరూ వెళ్లకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరించారు.



టీజీపీఎస్సీ నుంచి మరో నోటిఫికేషన్



కలంజ్యోతి, హైదరాబాద్ (అక్టోబర్ 29) : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మరో తీపి కబురు అందించింది. రాష్ట్ర ప్రభుత్వంలోని ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ డైరెక్టరేట్ విభాగంలో ఖాళీగా ఉన్న వివిధ ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఇందులో భాగంగా మల్టీ పర్పస్ సోషల్ ఆర్గనైజర్ (ఎంపీఎస్ఓ), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) కేడర్లలోని మొత్తం 102 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కమిషన్ ప్రకటించింది. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

రేపటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం..

ఈ పోస్టులకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ అక్టోబర్ 30 నుంచి ప్రారంభమై నవంబర్ 27 వరకు కొనసాగనుంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్ వర్గాలకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుందని పేర్కొంది. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్, ఎకనామిక్స్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపింది. పరీక్ష విధానం, సిలబస్, ఖాళీల పూర్తి వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక పోర్టల్‌ను పరిశీలించాలని అధికారులు వెల్లడించారు.



మంత్రిని కలిసిన మార్కెట్ కమిటీ

రైతుల సంక్షేమానికి బాధ్యతగా పనిచేయాలి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 28) : హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ హమీద్, వైస్ చైర్మన్ భాస్కర్, డైరెక్టర్లు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన పాలకవర్గాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతుల సంక్షేమానికి, వ్యవసాయ మార్కెట్ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా పాలకవర్గానికి ఆయన సూచించారు.



కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
గురువారం 29.10.2026
www.kalamjyothi.com

పీఆర్సీ అమలు హామీ నిలబెట్టుకోవాలి

- వెంటనే నివేదిక తెప్పించి పీఆర్సీ అమలుచేయాలి
- ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం చొరవ చూపాలి
- ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్



కలంజ్యోతి, ఆదిలాబాద్ (అక్టోబర్ 29) : రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ నివేదికను తెప్పించి వెంటనే అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్టీయూటీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ డిమాండ్ చేశారు. బోథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ విషయంలో ప్రభుత్వం ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని కోరారు. రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించడంతో పాటు, విద్యాశాఖలో జీవో 190ని అమలు చేయాలని, నూతన హెల్త్ స్కీమ్‌ను పారదర్శకంగా అమలు చేస్తూ క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రభుత్వం చొరవ చూపాలి..

రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపాలని జుట్టు గజేందర్ విజ్ఞప్తి చేశారు. సీపీఎస్ రద్దుపై అధ్యయన కమిటీని వేయాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఎయిడెడ్, మోడల్, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా ట్రెజరీల నుంచి వేతనాలు చెల్లించాలని, రేషనలైజేషన్ జీవో 25ను తక్షణమే సవరించాలని, సమగ్ర శిక్ష, గిరిజన సంక్షేమ శాఖల్లోని కాంట్రాక్టు సిబ్బందికి కనీస టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం. పర్వత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మూగ శ్రీనివాస్, రాష్ట్ర బాధ్యులు జాదవ్ అశోక్ కుమార్, బి. రవీంద్ర, పుప్పాల నరేందర్, చిల్క విలాస్, సమీర్ పాష, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సయ్య, భూమేశ్ పాల్గొన్నారు.

యువతిని వేధించిన యువకుడి అరెస్ట్



- గతంలోనూ పోక్సో కేసు
- నిందితుడిపై రౌడీషీట్ తెరుస్తాం
- చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు
- సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్రచారి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 28) : ప్రేమ పేరుతో యువతిని వేధింపులకు గురిచేసిన నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన ఓ యువతిని అదే ప్రాంతానికి చెందిన జుబేర్ గత కొన్ని రోజులుగా వెంటాడుతూ అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడు జుబేర్‌పై గతంలోనూ హుజూరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసు నమోదై జైలుకు వెళ్లి వచ్చినట్లు అధికారులు గుర్తించారు.

నిందితుడిపై రౌడీషీట్ తెరుస్తాం..

నిందితుడి పాత నేర చరిత్ర, ప్రవర్తనను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని రౌడీషీట్ తెరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని సిరిసిల్ల డీఎస్పీ కె. నాగేంద్రచారి స్పష్టం చేశారు. మహిళలు, యువతుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పోకిరీల ఆగడాలు, వేధింపులను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఆడబిడ్డల జోలికి వస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సమాజంలో ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అతిక్రమిస్తే సహించేది లేదని డీఎస్పీ కె. నాగేంద్రచారి స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలు, క్షణికావేశాలకు లోనుకాకుండా సన్మార్గంలో నడవాలని సూచించారు. ఎక్కడైనా వేధింపులకు గురైతే బాధితులు ఏమాత్రం భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. డీఎస్పీ వెంట ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్, ఎస్సై ఎన్. రమేష్‌గౌడ్, పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేటను కరువు మండలంగా ప్రకటించాలి



రహదారిపై బీజేపీ నిరసన

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 28) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఎల్లారెడ్డిపేటకు చోటు కల్పించకపోవడం అన్యాయమని బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి మండిపడ్డారు. మండలంలో సాధారణం కంటే 35 శాతం తక్కువ వర్షపాతం నమోదై వరి పొలాలు నిలువునా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తూ నాయకులతో కలిసి ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వర్షాభావ పరిస్థితులతో అల్లాడుతున్న అన్నదాతలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, సాగు, తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం..

ప్రస్తుత కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎల్లారెడ్డిపేట మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించి రైతులకు ఆర్థిక సహాయం అందించాలని నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి దాసరి గణేష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఉడుగుల యాదగిరి, ఉపాధ్యక్షులు బాలా గౌడ్, బందరు లక్ష్మారెడ్డి, రావుల గాల్‌రెడ్డి, గంట బాలకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, రంజిత్, వంగల రాజిరెడ్డి, సాగర్ గౌడ్, సాజిత్, రాకేష్, అంతర్పుల తిరుపతి, పరశురాం రెడ్డి, దేవయ్య, హనుమంతు, రాజు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం
- మద్దతు ధరతోనే రైతులకు మేలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 28) : రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తిమ్మాపూర్, గొల్లపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ వైస్ చైర్మన్ బుగ్గ కృష్ణమూర్తి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిపల్లి దేవానందం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోందని, రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఈ కేంద్రాల్లోనే విక్రయించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని వారు సూచించారు.

మద్దతు ధరతోనే రైతులకు మేలు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2461, కామన్ గ్రేడ్ రకానికి రూ.2441 చెల్లిస్తున్నట్లు నాయకులు వెల్లడించారు. ప్రభుత్వం సన్న రకాలకు క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా అందజేస్తోందని పేర్కొన్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వ కేంద్రాలకే తెచ్చి పూర్తి మద్దతు ధరతో పాటు బోనస్ సొమ్మును పొందాలని పిలుపునిచ్చారు.

దళారులను నమ్మి మోసపోవద్దు..

దళారుల మాయమాటలు నమ్మి రైతులు మోసపోవద్దని, నాణ్యతా ప్రమాణాల మేరకు ధాన్యాన్ని ఆరబెట్టి కేంద్రాలకు తీసుకురావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు పెంజర్ల నారాయణ, అందే గంగవ్వ, గుర్రాల సత్తిరెడ్డి, రానవేణి లక్ష్మణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నంది కిషన్, నాయకులు షేక్ గౌస్, దొమ్మాటి నరసయ్య, చేపూరి రాజేశం, తిమ్మాపూర్ సర్పంచ్ అందే సుభాష్, గొల్లపల్లి సర్పంచ్ కొండ రమేష్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్లు, జిల్లా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ కే సాహెబ్, బండారి బాల్‌రెడ్డి, పీఏసీఎస్ సెక్రటరీ కొండ శశివర్ధన్‌గౌడ్, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, రైతులు పాల్గొన్నారు.

యాసంగి సాగుపై ముందస్తు ప్రణాళిక

- ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకోవాలి
- పంట అవశేషాలను నేలలో కలియదున్నాలి
- వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి



కలంజ్యోతి, చెన్నారావుపేట (అక్టోబర్ 28) : రాబోయే యాసంగి సీజన్‌లో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు సంభవించే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు ప్రణాళికతో పంటల సాగు చేపట్టాలని వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి సూచించారు. చెన్నారావుపేట మండలంలోని కోనాపురం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను అంచనా వేసుకుని, లభ్యతకు తగినట్లుగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. నీటి పొదుపునకు దోహదపడే ఆధునిక సాగు పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలని, వరి సాగులో నీటి వినియోగాన్ని తగ్గించేందుకు జీరో వరి సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని స్పష్టం చేశారు.

అవశేషాలను నేలలో కలియదున్నాలి..

పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలే అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం వల్ల భూసారం పెరుగుతుందని, పర్యావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని వివరించారు. నీరు, విద్యుత్ వంటి సహజ వనరులను పొదుపుగా వినియోగిస్తూ పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మైదాం రాకేష్‌సుధాకర్, వ్యవసాయ అధికారి గోపాల్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ జూనీల్, ఉప సర్పంచ్ నర్సింరాములు, పీఏసీఎస్ డైరెక్టర్ ఆవుల రాములు, వ్యవసాయ విస్తరణ అధికారి శశి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
గురువారం 29.10.2026
www.kalamjyothi.com

భైంసా మాస్టర్ ప్లాన్ రూపకల్పన

- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వసతులు
- అందరికీ ఆమోదయోగ్యంగా ప్రణాళిక అమలు
- కలెక్టర్ భవేష్ మిశ్రా



కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 28) : పట్టణ సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ భవిష్యత్ తరాల అవసరాలకు తగ్గట్లుగా పకడ్బందీ పట్టణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణ సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన 2040 మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై బుధవారం స్థానిక పురపాలక కార్యాలయంలో రెండో కన్సల్టేటివ్ వర్కషాప్ నిర్వహించారు. ఈ కార్యశాలకు హాజరైన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రసంగిస్తూ పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు ముమ్మరం చేశామని తెలిపారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా వసతులు..

ప్రస్తుతం దాదాపు 60 వేల జనాభా ఉన్న భైంసా పట్టణం రాబోయే రోజుల్లో మరింత విస్తరించే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ప్రణాళిక అత్యవసరమని కలెక్టర్ భవేష్ మిశ్రా పేర్కొన్నారు. 2040 నాటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని విస్తృతమైన రహదారులు, విద్యా సంస్థలు, వైద్యశాలలు, క్రీడా మైదానాలు, పార్కుల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లో అత్యధిక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ముసాయిదా ప్రణాళికపై ఎవరికైనా అభ్యంతరాలు, సలహాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అందరికీ ఆమోదయోగ్యంగా ప్రణాళిక..

ప్రజలందరి భాగస్వామ్యం, సలహాలతో రూపొందే మాస్టర్ ప్లాన్‌తోనే పట్టణ రూపురేఖలు మారతాయని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఏడీ అశ్వని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పారిశ్రామిక, వాణిజ్య, నివాస జోన్ల ముసాయిదా పటాలను వివరిస్తూ సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, వైస్ చైర్మన్ కుతిజా సిద్దిఖీ, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ కమిషనర్ సంతోష్ కుమార్, కౌన్సిల్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుల త్యాగాలు ఎప్పటికీ ఆదర్శం

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే
- శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 28) : శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు వెలకట్టలేనివని అధికారులు పేర్కొన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ ఘాట్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో ఎస్పీ మహేష్ బి. గితే పాల్గొన్నారు. విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బందితో కలిసి ఉత్సాహంగా పరుగు తీసి వారిలో స్ఫూర్తి నింపారు.

పోలీసుల త్యాగాలు సమాజానికి ఎప్పటికీ ఆదర్శం..

ప్రజల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొనే సవాళ్లను ప్రజలకు వివరించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని, అమరుల ఆశయ సాధనకు అందరూ బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ సహకరించాలి..

చట్టాలను గౌరవిస్తూ శాంతిభద్రతల స్థాపనలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, ఆర్ఐ మధుకర్, ఎస్ఐలు, విద్యార్థులు, వాకర్స్ పాల్గొన్నారు.





బాధితులకు పీఎం రాహత్ సాయం

- సకాలంలో వైద్యసేవలు అందించాలి
- పోర్టల్ ద్వారా నిరంతర పర్యవేక్షణ
- కలెక్టర్ భవేష్‌మిశ్రా

కలంజ్యోతి, నిర్మల్ (అక్టోబర్ 28) : రోడ్డు ప్రమాదాల బారిన పడిన బాధితులకు తక్షణ వైద్యసాయం అందించి ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని అధికారులు ఆదేశించారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో పీఎం రాహత్ పథకం అమలు తీరుతెన్నులపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఈ పథకాన్ని అత్యంత సమర్థవంతంగా అమలు చేసి ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు.

సకాలంలో వైద్యసేవలు అందించాలి..

రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లోగా అత్యవసర వైద్యసేవలు అందేలా వైద్య, పోలీసు, రవాణా శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. పథకం అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా సహించేది లేదని, ప్రతి బాధితుడికి సత్వరమే నాణ్యమైన చికిత్స అందేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పోర్టల్ ద్వారా నిరంతర పర్యవేక్షణ..

పీఎం రాహత్ పథకానికి సంబంధించిన ప్రత్యేక పోర్టల్‌ను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో అందుతున్న సేవల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు స్పష్టం చేశారు. బాధితులకు అందించే ఆర్థిక, వైద్య సహాయంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో రవాణా శాఖ అధికారులు తిరుపతి, అసీఫ్, రజినీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- కొన్యాల సర్పంచ్ సుజాత సత్యం
- వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

కలంజ్యోతి, హత్నూర (అక్టోబర్ 29) : రైతులు తాము పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కొన్యాల సర్పంచ్ సుజాత సత్యం పిలుపునిచ్చారు. హత్నూర మండల పరిధిలోని కొన్యాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొన్యాల ఎంపీటీసీ విట్టల్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
గురువారం 29.10.2026
www.kalamjyothi.com



క్రీడలతో మానసిక ఉల్లాసం

- స్నేహపూర్వక వాతావరణంలో పోటీపడాలి
- క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుంది
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కలంజ్యోతి, హత్నూర (అక్టోబర్ 29) : క్రీడాకారులు సోదరభావంతో స్నేహపూర్వక వాతావరణంలో క్రీడల్లో పాల్గొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి పిలుపునిచ్చారు. హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్ గ్రామంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 70వ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తిని చాటాలని ఆమె సూచించారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం పెరుగుతుంది..

నిత్యం క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దారుఢ్యం పెంపొందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని, పోటీల ద్వారా కొత్త పరిచయాలు ఏర్పడి స్నేహబంధాలు బలపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకట నరసయ్య, హత్నూర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, దౌల్తాబాద్ సర్పంచ్ సంగీత నర్సింలు, గుండ్ల మాచనూర్ సర్పంచ్ శ్రీహరి, దౌల్తాబాద్ ఉపసర్పంచ్ శేఖర్ గౌడ్, వార్డు సభ్యుడు గౌస్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఎండీ ఇబ్రహీం, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





ఎల్లమ్మ సేవలో గంట దంపతులు

- రూ. 3 కోట్లతో కృష్ణశిలా ఆలయ పునర్నిర్మాణం
- రూ. 2,00,016 విరాళం అందజేత
- దాతృత్వం చాటుకున్న గంట కార్తీక్‌గౌడ్, రేఖ
- వచ్చే నెల 14 నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు
- దాతల సహకారం స్ఫూర్తిదాయకం : ఆలయ పునర్నిర్మాణ కమిటీ

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (అక్టోబర్ 29) : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో కృష్ణశిలతో నిర్మిస్తున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ మహా క్రతువుకు దాతలు పెద్దఎత్తున తరలివచ్చి ఆర్థిక సహకారం అందిస్తున్నారు. వచ్చే నెల 14వ తేదీ నుంచి 17 వరకు ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు హోమం, ఎల్లమ్మ సిద్ధోగం మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా ఎల్లమ్మ గడను మండల గౌడ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్ గౌడ్, రేఖ దంపతుల నివాసానికి గౌడ సంఘం నాయకులు, సభ్యులు మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లారు.

మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సుమారు రూ. 3 కోట్ల భారీ వ్యయంతో కృష్ణశిలతో అత్యంత వైభవంగా పునర్నిర్మిస్తున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ మహా ప్రతిష్ఠాపన ఉత్సవాలకు దాతలు పెద్దఎత్తున తరలివస్తున్నారు. వచ్చే నెల 14వ తేదీ నుంచి 17 వరకు ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు హోమం, ఎల్లమ్మ సిద్ధోగం మహోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్న వేళ, మండల గౌడ సంఘం అధ్యక్షుడు గంట కార్తీక్ గౌడ్, రేఖ దంపతులు తమ నివాసానికి వచ్చిన ఎల్లమ్మ గడను భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ఆలయ ఉత్సవాల నిర్వహణ నిమిత్తం రూ. 2,00,016 భారీ విరాళాన్ని అందజేసి విశేష దాతృత్వాన్ని చాటుకున్నారు.

వచ్చే నెల 14 నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు..

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, సిద్ధోగం వేడుకల నిర్వహణ ఖర్చుల నిమిత్తం కార్తీక్ గౌడ్ దంపతులు భక్తిశ్రద్ధలతో రూ. 2,00,016 నగదును ఆలయ కమిటీకి విరాళంగా అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆలయ పవిత్ర కార్యానికి భారీ విరాళం ప్రకటించి ఉదారత కనబరిచిన గంట కార్తీక్ గౌడ్ దంపతులను గౌడ సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రతిష్ఠాపన, సిద్ధోగం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతం కావడానికి భక్తులు, దాతల తోడ్పాటు ఎంతో అవసరమని సంఘం నాయకులు పేర్కొన్నారు.



దాతల సహకారం స్ఫూర్తిదాయకం.. :

కార్తీక్ గౌడ్ కుటుంబం చేసిన ఈ ఆర్థిక సాయం మిగతా భక్తులకు, దాతలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని నాయకులు కొనియాడారు. శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి చల్లని ఆశీస్సులు గంట కార్తీక్ గౌడ్ కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులోనూ వారు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని గౌడ సంఘం పెద్దలు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రముఖులు, వివిధ గ్రామాల ప్రతినిధులు, వార్డు పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో విమానాల రద్దు

కలంజ్యోతి, శంషాబాద్ (అక్టోబర్ 29) : అర్నాబ్ తుపాను ప్రభావంతో శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) నుంచి నడిచే పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తీవ్రమైన ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మొత్తం 33 విమానాలను రద్దు చేసినట్లు విమానాశ్రయ వర్గాలు ప్రకటించాయి. దీంతో విమానాశ్రయానికి చేరుకున్న వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రిలతో పాటు జగదల్పూర్, రాయగడ మార్గాల్లో నడిచే విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం పడింది.

ఏపీ మార్గాలపై తీవ్ర ప్రభావం..

విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య నడిచే 13 విమానాలు, విజయవాడ-హైదరాబాద్ మధ్య 5 విమానాలు, రాజమండ్రి-హైదరాబాద్ మధ్య 12 విమానాలు పూర్తిగా రద్దయ్యాయి. వీటితో పాటు జగదల్పూర్-హైదరాబాద్ మధ్య 2 విమానాలు, హైదరాబాద్-రాయగడ మార్గంలో 1 విమానాన్ని భద్రతా కారణాలతో రద్దు చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రయాణికులు విమానాశ్రయానికి బయలుదేరే ముందే సంబంధిత ఎయిర్‌లైన్స్ వెబ్‌సైట్ లేదా కస్టమర్ కేర్ ద్వారా విమానాల తాజా స్థితిని తెలుసుకోవాలని అధికారులు సూచించారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

మా కష్టాన్ని తక్కువ చేసి చూడొద్దు

సినీ పరిశ్రమలో స్టార్ కిడ్స్ పడే శ్రమను పట్టించుకోకుండా నెపోటిజం ముద్ర వేయడం సరికాదని నటి సారా అలీ ఖాన్ స్పష్టం చేశారు. ఎనిమిదేళ్ల క్రితం కేదార్‌నాథ్ చిత్రంతో కెరీర్ ప్రారంభించిన నాటి నుంచి ప్రతి అడుగు స్వయంగా వేస్తూ ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని తెలిపారు. తన తరఫున ఎవరూ సిఫార్సులు చేయలేదని, అమ్మ పెంపకంలోనే సొంత నిర్ణయాలతో ఎదిగానని వెల్లడించారు. స్టార్ కిడ్స్ అయినప్పటికీ జాన్వీ కపూర్, అనన్యా పాండే, తాను ప్రతిభనే నమ్ముకుని కష్టపడుతున్నామని పేర్కొన్నారు. ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న తామె ప్రతీసారీ అర్హతను నిరూపించుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.



Printed and Published by PENDYALA JYOTHI on behalf of PENDYALA JYOTHI, Printed at Rudra Kakatiya Printers and Graphics H.no.183/85/12/38, Somidi Road, Kazipet, Warangal, 506003., Published at H.No. 30/1/426, Madikonda, Kazipet, Hanumakonda District. Telangana, 506142, Editor : RAMESH PENDYALA. Ph : 9494 009 003.